స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 87 | శనివారం, 15 ఆగస్టు, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 87 | SATURDAY, AUGUST 15, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## జనగణన‘2027’పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్

• 40 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసిన కేంద్రం

2 లో..

# ఇన్వెస్ట్ తెలంగాణ

**డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0’కు కేబినెట్ నిర్ణయం**

• ఈసారి ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ థీమ్‌తో నిర్వహణ • సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుకు నిర్ణయం • ఎవరి భూమి ఎక్కడికీ పోదు.. ఆందోళన వద్దు • క్యూర్ పరిధిలో ఈవీలుగా ఆటోల మార్పు • ఆటోకు రూ.లక్షన్నర సబ్సిడీ.. 200 కోట్లతో పథకం • నేడు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ • ఏడు రకాల సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లింపు • హిల్ట్ పాలసీ దరఖాస్తులకు మరో 3 నెలల గడువు • మరో 7 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు • వివాదాల్లేని భూములను 22ఏ నుంచి తొలగిస్తాం • కలెక్టర్లకు, రిజిస్ట్రార్లకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం • సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం • క్యాబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య):

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ రైజింగ్2.0 సమ్మిట్, స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ, సన్న వడ్లకు సబ్సిడీ సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. మిగతా 2లో..






## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

• ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు • నేడు సంగారెడ్డిలో సిఎం చేతుల మీదుగా విడుదల

సంగారెడ్డి, ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య):

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్డులు అందచేయనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్తాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి మిగతా 2లో..


## పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికే

# పెద్దపీట!

• పారిశ్రామికావసరాలకు తర్వాతి ప్రాధాన్యం: సీఎం • రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి సద్వినియోగమే కీలకం • నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్య ప్రాజెక్టులు పూర్తి • పోలవరం వద్ద గండిపోశమ్మ గుడిని పరిరక్షించాలి • మార్చికల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ పూర్తి చేయాలి • డేటా సెంటర్లకు మూడున్నర టీఎంసీలు చాలు.. అయినా కొందరి దుష్ప్రచారం • జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి, (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో నీటి లభ్యత ఆధారంగానే (వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్) ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. పారిశ్రామికావసరాలకు ద్వితీయ ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలను, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలన్నారు. ఈ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో జలవనరుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా ప్రాధాన్య క్రమంలో చేపడుతున్న 36 ప్రాజెక్టుల పురోగతి, రిజర్వాయర్లలో నీటి నిల్వలు,



నీటి విడుదల, తాగునీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక జలహారతి కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు మిగతా 2లో..

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రెడీ

• బ్యాంకు ఖాతాలో అడ్వాన్సుగా ఉంచుతున్నాం • ఈ విద్యాసంవత్సరానికి రూ.250 కోట్లు ఉంచాం • ఒలింపిక్స్ పతకం తెస్తే ప్రభుత్వ ఉద్యోగమిస్తాం • రాష్ట్రంలో కులగణన చేసి కేంద్రానికి సవాలు విసిరాం • విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు పనిచేస్తా • మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణలో సీఎం రేవంత్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

విద్యార్థుల ఫీజులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభవార్త చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాలో ఉంచుతున్నామని తెలిపారు. కాలేజీలో అడ్మిషన్ పొందిన వెంటనే ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని, నెల రోజుల్లోవిద్యార్థి ఖాతాలో ఫీజు జమ చేస్తామని ప్రకటించారు. “ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అడగకుండానే మీ ఖాతాలో వేస్తాం. ఇందుకోసం ప్రతి సంవత్సరం రూ.2400 కోట్లను అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాలో పెట్టి.. విద్యార్థుల ఖాతాల్లోకి బదిలీ చేస్తాం. ఈ విద్యా సంవత్సరానికి రూ.250కోట్లు మిగతా 2లో..





## గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

• సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే.. ఆగస్టు చివరి నాటికి టెండర్ పక్రియ పూర్తి చేయాల్సిందే • నాణ్యతలో రాజీ పడొద్దు.. • గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

’గోదావరి పుష్కరాలు‘2027’ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ పక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ’గోదావరి పుష్కరాలు 2027’ కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖల వారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్‘1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్‌ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా మిగతా 2లో..

## వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేయాలి: రాష్ట్రపతి ముర్ము

దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ‘వికసిత్ భారత్’ లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు. యువత తమ ప్రతిభను ఉపయోగించుకుని తమ స్వప్నాలను సాకారం చేసుకోవడంతో పాటు దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన ‘వందేమాతరం’ గేయాన్ని గౌరవించాలని రాష్ట్రపతి ప్రజలను



కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన న్యాయవ్యవస్థ, చట్టసభలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

• పూలే దంపతుల ఆశయ సాధనలో ప్రజా ప్రభుత్వం • దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన • రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు • ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం • విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం • పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2 లో..



## దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

‘పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే’పై ప్రధాని మోడీ

2 లో..

## సోషల్ మీడియా పోస్టులపై జాగ్రత్త

• అతిగా అనవసర విషయాలపై జోక్యం తగదు • పార్టీ శ్రేణులకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హితవు

అమరావతి, (వార్త వేదిక సూర్య):

సోషల్ మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ



సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనవసర విష యాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత విషయాలు, మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 87
శనివారం 15 ఆగస్టు, 2026

# ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మం త్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 7,8,9 తేదీ ల్లో ఈ సదస్సు నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిం ది. గతేడాది తెలంగాణ రైజింగ్–2047 విజన్ ఆవిష్కరించినట్లే ఈసారీ ఇన్వెస్ట్ థీమ్‌తో తెలంగాణ సదస్సు నిర్వహణను మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందని మంత్రులు వివరించారు. వివాదాల్లేని ఆస్తులు/భూములు నిషేధిత జాబితా (22ఏ)లో ఉంటే.. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు, రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని రెవె న్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములు/స్థలాలు కాకపోతే, ఆ భూములపై న్యాయస్థానాల్లో వివాదాలు లేకపోతే.. వాటిని నిరభ్యంతరంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అనుమతించాల్సిందిగా నిర్దేశించామన్నారు. ఒక్క అంగుళం భూమి కూడా ఎక్కడికీ పోదని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. 22ఏ జాబితాకు సంబంధించి ఏదైనా అంశం మీడియా దృష్టికి వస్తే.. తన నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని, గంటలోపే స్పందిస్తానని అన్నారు. ఇప్పటికే కోర్ ఏరియా పరిధిలోని 46 మంది సబ్ రిజిస్ట్రార్‌లను ఆదేశాలు ఇచ్చామన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, క్యూర్ పరిధిలో ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం, సన్నవడ్లకు బోనస్ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పంద్రాగస్టు రోజు మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.43 లక్షల కుటుంబాలకు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతేడాది డిసెంబరులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో 'తెలంగాణ ఇన్వెస్‌మెంట్ థీమ్'తో సమ్మిట్ 2.0ను నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయుంచినట్లు వెల్లడించారు. దీనికోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంతులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్‌లతో ఉపసంఘంతోపాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా రంగంలో పెట్టుబడుల స్వీకరణకు వీలుగా దీనిపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### ఏడ రకాల సన్నాలకు బోనస్..

మద్దతు ధరతోపాటు బోనస్ ఇచ్చేందుకు ఏడు సన్నవడ్ల రకాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ''దీనికోసం ఇప్పటికే రైతాంగానికి విత్తనాలు కూడా సరఫరా చేశాం. ఏడు వడ్ల రకాలను వ్యవసాయ శాఖ వద్ద రిజిస్టర్ చేసుకున్న వారినుంచి ఆయా రకాలను సేకరించేందుకు మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది'' అని పొంగులేటి వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. ఇందులో 63.62 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుందని, మిగతా 17.54 లక్షల టన్నులను ఈ–వేలం ద్వారా విక్రయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. క్వింటాలుకు రూ.2,389 కనీస ధరగా నిర్ణయించి.. విక్రయించాలని నిర్ణయించిందన్నారు.

### 7 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురానున్నట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. సాంకేతిక విద్యాశాఖ నుంచి వర్సిటీ కిందికి తెస్తామని, వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ(కార్మిక శాఖ) పరిధిలోకి విలీనం చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. రాష్ట్రంలోని 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేయనుండగా.. వీటిలో 86 చోట్ల ఇప్పటికే స్కూళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు కొత్తగా స్కూళ్లను మంజూరు చేయాలని మంతివర్గంలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రతి స్కూలుకు రూ.200 కోట్లు వెచ్చించి, నిర్మాణం చేపట్టనున్నట్లు, 3500 మంది చొప్పున విద్యార్థుల కోసం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయించినట్లు వెల్లడించారు.

### ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చుకునేందుకు సబ్సిడీ

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి, హైదరాబాద్‌ను గ్రీన్‌సిటీగా మార్చేందుకు మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. క్యూర్ పరిధిలో డీజిల్, పెట్రోల్‌తో 18,766 ఆటోలు నడుస్తున్నాయని, వీటిని ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చడానికి వీలుగా రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం అవకాశం ఇవ్వనుందన్నారు. ఇక ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 21 పారిశ్రామిక వాడల్లోని 9,292 ఎకరాల భూములను క్రమబద్ధీకరించి, ఆయా పరిశ్రమలను ఔటర్ ఆవలికి తరలించడానికి వీలుగా ప్రభుత్వం తెచ్చిన హిల్ట్ పాలసీ కింద దరఖాస్తు చేసుకునే గడువును మరో మూడు నెలలు అక్టోబరు 31 దాకా పొడిగించాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశలో ఆయకట్టును అభివృద్ధి చేయడానికి రూ.2100 కోట్లతో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను చేపట్టడానికి పరిపాలన అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గూడెం దొడ్డిలో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై కన్సల్టెన్సీని నియమించుకోవడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు.

## పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికే పెద్దపీట!

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్–1 ఈసీఆర్ఎఫ్ గ్యాప్–2 పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రాజెక్టు పనులు కొనసాగించామని తెలిపారు. డ్యాం సైట్ వద్ద రహదారులతో పాటు డ్యాం నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చికల్లా విశాఖ వరకూ ఎడమ ప్రధాన కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలన్నారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు నింపాలని సూచించారు. పోలవరం కుడి, ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. ఈ రెండు కాలువలకూ మంచి పేర్లు సూచించాలని అధికారులను కోరారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాలను పర్యాటకంగానూ తీర్చిదిద్దాలన్నారు.

## దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

న్యూఢిల్లీ : దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు అని అన్నారు.

## గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

**పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌర వం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకి తభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పత కాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహ ణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధా రణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కా రం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతం త్య దినోత్సవం, గణతంత్ర దినోత్స వం సంద ర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేం ద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది.

## మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

హైదరాబాద్,ఆగస్టు14(వార్త వేదిక సూర్య):

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల విదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు. బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో



ఏ ప్రభుత్వమ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. త ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లు తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లుగా.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## జనగణన'2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్

**40 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసిన కేంద్రం**

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన '2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది.



జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన'2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ పక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

## నేరాల స్వరూపం మారుతోంది

**సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్**
**రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన**
**డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు14 (వార్త వేదిక సూర్య):

నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్ధిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యం లో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరికొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల ను అందించ డానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి కే ముద్రణ పూర్తి చేసుకున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్ర్య దినో త్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## విదార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రెడీ

(మొదటి పేజీ తరువాయి)

అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాలో పెట్టాం. మీరు చింతించాల్సిన అవసరం లేదు. భవిష్యత్తులో ఏ కాలేజీ కూడా మీరు ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వబోమనే అవకాశం ఇవ్వం'' అని సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి చెప్పారు. హైదరా బాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరాన ఉన్న నెక్లెస్ రోడ్డుకు, హెచ్ఎండీఏ గ్రౌండ్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం హెచ్ఎం డీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. నగరం నడిబొడ్డున నెక్లెస్ రోడ్డులో ఓవైపు అంబేద్కర్, మరో వైపు జ్యోతిబా పూలే, చౌరస్తాలో ఇందిరాగాంధీ, ఆ పక్కన పీవీ నర్సింహారావు విగ్రహాలను పెట్టింది వారి వర్ధంతులు, జయంతులు జరుపుకోవడానికి మాత్రమే కాదన్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రయాణిస్తున్నప్పుడు ఈ గొప్ప వ్యక్తుల విగ్ర హాలను చూసి.. వారు చేసిన త్యాగాలను, వారి స్ఫూర్తిని పొం దాలని, ఆ స్ఫూర్తితో విద్యలో రాణిస్తూ సామాజిక చైతన్యంతో వ్యవహరించాలని సూచించారు. సమాజంలో అంటరానితనం, ఆకలి కేకలు, నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు ఉండి.. చదువు అనేదే అందని సమయంలో మహిళలకు చదువు అం దించిన మహనీయుడు పూలే అని సీఎం రేవంత్ కొనియా డారు. 136 ఏళ్ల క్రితం మరణించినా.. సమాజంలో వారు తీసుకొచ్చిన సామాజిక విప్లవాన్ని గుర్తు చేసుకుంటున్నామని, ప్రజాపాలనలో ఇందిరమ్మ రాజ్యంలో అదే విధానాన్ని కొనసా గిస్తున్నామని తెలిపారు. చదువు ఒక్కటే తలరాతను మారుస్తుం దని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టి సమాజంలో గుర్తింపునిస్తుందని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు వేర్వేరుగా రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకోవడం కాదని, అందరూ కలిసికట్టుగా ఉన్నత వర్గాలతో సహా ఒకే దగ్గర చదువుకోవ డం, కూర్చొని తినడం, కలిసి జీవించడం ద్వారా కుల వ్యవస్థ ను నిర్మూలించవచ్చని తెలిపారు. అందుకోసమే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విప్లవాత్మకంగా తీసుకొచ్చామని చెప్పారు. కొందరు చదువు కంటే కూడా సాంకేతిక నైపుణ్యంలో, క్రీడల్లో రాణిస్తుంటారు. క్రీడల్లో రాణిస్తే నగదు బహుమతితోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలకు పంపించే బాధ్యత నేను తీసుకుంటాను. మీ భవిష్యత్తు కోసం ప్రణాళికలు రచిస్తాను. మీరు క్రీడల్లో రాణించండి.. రాష్ట్ర, జాతీయ స్థాయితోపాటు ఒలింపిక్స్ పతకాలు తీసుకురండి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి నగదు నజరానాలు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటాను'' అని సీఎం అన్నారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ కులాల వర్గీకరణ కోసం 40 ఏళ్లు కొట్లాడారని సీఎం రేవంత్ అన్నారు. ఎవరూ అమలు చేయని దానిని తాము ధైర్యంగా ఉపకులాల వర్గీకరణ చేశామని తెలిపారు. గ్రూప్–1 అధికారులుగా దాదాపు 40 మందికి వర్గీకరణ ద్వారానే నియామక పత్రాలు అందించామని తెలిపారు. బలహీన వర్గాల గణన చేపట్టాలన్న ఆలోచనను వందేళ్లలో ఎవరూ చేయలేదని, దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ కులగణన చేసిందని చెప్పారు. బీసీల లెక్కలు తేల్చి కేంద్ర ప్రభుత్వానికి సవాలు విసిరామన్నారు. దీనిపై కోర్టులో పిటిషన్లు వేసినవారు, లిటిగేషన్లు పెట్టినవారు, మాజీ ముఖ్యమంత్రిగా, మాజీ మంత్రులుగా చేసినోళ్లు కులగణనలో పాల్గొనలేదని విమర్శించారు. లెక్కలకు వస్తే వారు ఎంతమంది ఉన్నారో, వారికి ఎన్ని పదవులు ఇచ్చారో తెలుస్తుందనే రాలేదని ఆరోపించారు. వారు అసెంబ్లీలో వ్యతిరేకించినా చట్టపరంగా కమిషన్‌ను నియమించి అన్ని నిబంధనలు అమలు చేసి బీసీల లెక్కలు తేల్చిన మొదటి రాష్ట్రం, చివరి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. గొప్పలు చెప్పే ప్రధానమంత్రి కూడా గుజరాత్‌లో చేయలేదన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని, ప్రజా ప్రతినిధులై చట్ట సభలలకు రావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసే బాధ్యత తనదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వి.హనుమంతరావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పోస్టులపై జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత దూష ణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విష యంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు. అ సభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లా డండి. పార్టీ అంతర్గత విషయాల పట్ల సోషల్ మీడియా వేదిక గా ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ భావజాలాన్ని కించపరి చేలా మాట్లాడే వారిని ఉపేక్షించం. పార్టీ క్రమశిక్షణకు విఘా తం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో చిక్కుకోవద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి. పార్టీ అభ్యున్నతి, కష్టపడి పనిచేసే వారి సంక్షేమం పార్టీ దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి' అని పవన్ పిలుపునిచ్చారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# రంగారెడ్డి



## కాముని చెరువు పరిశుభ్రతకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యవేక్షణ

**రాజేంద్రనగర్, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య ) :**

కాముని చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి, చెరువును పరిశుభ్రంగా మార్చేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి చెరువు పరిశుభ్రత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడం వల్ల నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే చెరువులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## 765 కేవీ హైటెన్షన్ లైన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రైతుల వినతి**

**కల్వకుర్తి , ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య ) :**




కడ్తాల్ పట్టణం మీదుగా వెళ్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కారణంగా నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రైతులు, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. హైటెన్షన్ లైన్ ఏర్పాటుతో పంటలు, భూములు నష్టపోయిన రైతుల వివరాలను ఎమ్మెల్యేకు వివరించి, బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిక్షపతి, ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## దేశభక్తి స్ఫూర్తిని చాటిన బీజేపీ తిరంగా ర్యాలీ

**సికింద్రాబాద్, ఆగస్టు 14(వార్త వేదిక సూర్య)**



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొనడం జరిగింది. ట్యాంక్‌బండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గారు హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..దేశ సమైక్యత, సమగ్రత, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించింది. ఈ కార్యక్రమంలో మోండా మార్కెట్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక, నిజామాబాద్ ఎంపి అరవింద్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..వైశాలి గార్డెన్స్ ప్లేగ్రౌండ్ శుభ్రత

**బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేశ్ గౌడ్**

**సికింద్రాబాద్, ఆగస్టు 14(వార్త వేదిక సూర్య)**

వైశాలి గార్డెన్స్‌లోని ప్లేగ్రౌండ్‌లో నెలకొన్న సమస్యలపై స్థానిక నివాసితులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన మురారి స్మితా కోటేశ్ గౌడ్, వైశాలి గార్డెన్స్ అధ్యక్షులతో కలిసి జిహెచ్ఎంసి సిబ్బందితో సమన్వయం చేశారు. ఈ సందర్భంగా +ఎవీజ సిబ్బంది సహకారంతో ప్లేగ్రౌండ్‌ను పూర్తిగా శుభ్రపరిచేలా చర్యలు చేపట్టి, పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైశాలి గార్డెన్స్‌లో నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మురారి స్మితా కోటేశ్ గౌడ్ తెలిపారు. ప్రజలకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన పరిసరాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# గణేష్ నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి




**- జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య ) :**

పాత నగరంలోని చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర నియోజకవర్గాల పరిధిలో సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం బుద్వేల్‌లోని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫలక్‌నుమా ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఆర్చ్‌లను తొలగించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరిన నేపథ్యంలో, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రహదారులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రతి వీధిలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని సూచించారు.

గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్లు పాపయ్య, సరిత, సురేందర్‌తో పాటు పాత నగర బీజేపీ నాయకులు కౌడి మహేందర్, జె. నవీన్ యాదవ్, నంద కిషోర్, ప్రభాకర్ రావు, ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్, పొన్న శ్రీనివాస్, అడికె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మోడల్ స్కూల్ నేదునూరులో అవగాహన ప్రోగ్రాం




కెనరా విద్యా జ్యోతి స్కాలర్‌షిప్‌ల పంపిణీ

**మహేశ్వరం ఆగస్టు 14 వార్త వేదిక సూర్య**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు సాయంత్రం 4:00 గంటలకు తెలంగాణ మోడల్ స్కూల్, నేదునూరులో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో "కెనరా విద్యా జ్యోతి స్కీమ్" ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ హెచ్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి విష్ణుప్రియ, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ బి. సైదా, జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్సై పరమేష్ తదితరులు కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు.

**విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి: ఇన్‌స్పెక్టర్ హెచ్. వెంకటేశ్వర్లు**

ముఖ్య అతిథి శ్రీ హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా నేటి సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, సైబర్



మోసాలు, ఫ్రాడ్ కాల్స్, ఆన్‌లైన్ గేమ్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా ధైర్యంగా, అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైనప్పుడు పోలీసుల సహాయం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కెనరా బ్యాంక్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం గ్రాండ్ ఎరేనా స్పోర్ట్స్ కౌంటీలో EWCL సీజన్-1 గ్రాండ్ ఓపెనింగ్




## మహిళా క్రికెట్ లీగ్‌కు వైభవంగా శుభారంభం

**మహేశ్వరం, ఆగస్టు 14: వార్త వేదిక సూర్య**

మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గ్రాండ్ అరేనా వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఎమర్జింగ్ ఉమెన్స్ క్రికెట్ లీగ్' (జుబెజూ) సీజన్-1 ప్రారంభోత్సవ వేడుకలు కనువిందుగా జరిగాయి. ఈ మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన విజేతల ట్రోఫీని కోదాడ శాసనసభ్యులు శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి మరియు జుబెజూ మేనేజింగ్ డైరెక్టర్ రవి సుబ్రహ్మణ్యం ఇతర ముఖ్య అతిథులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా టోర్నమెంట్‌లో పోటీపడుతున్న మొత్తం 16 జట్ల వివరాలు, వాటి అధికారిక లోగోలను నిర్వాహకులు ప్రదర్శించారు.

**జుబెజూ సీజన్-1లో పోటీపడుతున్న జట్లు:**

బ్లాక్ స్వాన్ వారియర్స్, థండర్ హాక్స్, ఫీనిక్స్ క్వీన్స్, రాయల్ పీహెన్స్, మిస్టిక్ ఔల్స్, గోల్డెన్ ఈగల్స్, సఫైర్ కింగ్‌ఫిషర్స్, స్టార్మ్ ఆస్ప్రేస్, ఫాల్కన్స్, ఎమరాల్డ్ పారకీట్స్, ఫైర్‌వింగ్ ఫాల్కన్స్, సెలెస్టియల్ క్రేన్స్, డైమండ్ డోవ్స్, రూబీ రాబిన్స్, పింక్ ఫ్లెమింగోస్, మకావ్స్ ట్రోఫీ ఆవిష్కరణ అనంతరం వేదికపై క్రీడాకారిణులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. విద్యుత్ దీపాల వెలుగులో సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడా సంబరానికి మరింత వన్నె తెచ్చాయి. ఈ లీగ్ ద్వారా అణగారిన ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చి, మహిళా క్రికెటర్లకు జాతీయ స్థాయిలో గొప్ప వేదిక కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.



## వ్యసన విముక్తి ప్రతిజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ

**- నశా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ప్రతిజ్ఞ**

**వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు**

**మొయినాబాద్ , ఆగస్టు 14(వార్తా వేదిక సూర్య) :**

వ్యసనాలకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని బ్రహ్మ కుమారిస్ చిలుకూరు శాఖ నిర్వాహకులు బీకే మంజుల, దేవిలు తెలిపారు. శు క్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరులో నిర్వహించిన వ్యసనాలకు వ్యతిరేకం గా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం పోస్టర్ను చిలుకూరు లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదేవిధంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ లో ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో కలిసి నశా ముక్త్ భారత్ అభియాన్(వ్యసన ముక్త భారత ప్రచార యా)లో భాగంగా వ్యసనాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ముఖ్యంగా యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బీకే మంజుల, దేవి, శ్రీనివాస్, యాదయ్య, ప్రకాష్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి

**మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ సామల**

**సికింద్రాబాద్, ఆగస్టు 14(వార్త వేదిక సూర్య)**




కళ్యాణ లక్ష్మీ పథకం పై కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల, తుల ఉమ, విజయ రెడ్డి, అడ్వకేట్ నిరోష, మహిళా నాయకురాలు అరుణ, ప్రమీల, కవితలను పోలీసులు అరెస్ట్ చేసి బేగం బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమ సామల మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న కళ్యాణ లక్ష్మీ పథకంపై కూడా స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. వెంటనే కోర్టులో కౌంటర్ దాఖలు చేసి పేద ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను బిఆర్ఎస్ మహిళా విభాగం అడ్డుకుంటుందని హెచ్చరించారు.

## సీనియారిటీ ఆధారంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఆర్ఓకు వినతి

**జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరగాలి**

**కూకట్‌పల్లి ఎంఆర్ఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్టులు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య) :**

కూకట్‌పల్లి మండల పరిధిలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు మండల రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హత, సీనియారిటీ, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలని కోరారు. ఏ విధమైన రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇదే విషయం పై వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

**సీనియారిటీ ఆధారంగా పరిశీలిస్తాం: ఎంఆర్ఓ**

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఆర్ఓ అశోక్‌కుమార్ స్పందిస్తూ.. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అర్హత, సీనియారిటీ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కట్టెల మల్లేష్, సి.హెచ్. రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎం.ఎస్. ఆనంద్‌రావు, అంబటి వెంకట్, జంగాల నాగార్జున, బి. శంకర్ పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 87
శనివారం
15 ఆగష్టు 2026

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )

ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పోలీస్ పరేడ్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే వారి కి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు చెప్పారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరుకానున్నారని, మంత్రి ఉదయం 9.30 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న వేదిక వద్దకు చేరుకున్న వెంటనే జాతీయ గేయాలపన ఉంటుందని, అనంతరం మంత్రివర్యులు జాతీయ పథకాన్ని ఆవిష్కరిస్తారని, వెంటనే జాతీయ గీతాలాపన, తదుపరి రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ ఉంటాయని, గౌరవ వందన స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ఉదయం 9 గంటల 50 నిమిషాలకు గౌరవ మంత్రి సందేశం ఉంటుందని, ఉదయం 10 గంటలకు పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10:30కు వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా రూపొందించిన శకటాల ప్రదర్శన, 10 :50 నిమిషాలకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాల ప్రధానం, 11:30 గంటలకు ఆయా శాఖల ద్వారా లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 11 గంటల 40 నిమిషాలకు స్టాల్స్ సందర్శన, 12 గంటలకు జాతీయ గేయం, జాతీయ గీతాలాపన తో కార్యక్రమం ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. జాతీయ పతాకం ఎగరవేసే వేదిక తో పాటు, వేడుకలకు వచ్చే ప్రముఖులకు, అదే విధంగా ప్రజలకు, మీడియా ప్రతినిధులకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, శకటాలను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేయడం, అదేవిధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రస్ఫుటమయ్యే విధంగా చూడడం ,ప్రత్యేకించి స్టాల్స్ ,శకటాలపై ప్రదర్శించే ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగు లను ప్రోటోకాల్ ప్రకారం రూపొందించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులందరూ ముందుగానే హాజరుకావాలని, వారి శాఖలకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందే పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్ మొత్తం శుభ్రంగా ఉంచడం తో పాటు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రధమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని చెప్పారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్ఓ దశరథ్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.




# కార్పొరేట్ల కబంధహస్తాల నుండి భారతదేశాన్ని కాపాడుకుందాం : సిఐటియు

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )

సామ్రాజ్యవాదం పై పోరాడి స్వాతంత్రాన్ని తీసుకొచ్చిన వీరుల త్యాగఫలితాన్ని నేడు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల కు అప్పచెప్పుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం యంగ్ వర్కర్ స్టీరింగ్ కమిటీ జిల్లా కన్వీనర్ చినపాక లక్ష్మీనారాయణ ఆరోపించారు. శుక్రవారం మైసయ్య విగ్రహం నుండి ఎగ్బాల్ మినార్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పితూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించి వేస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ జైల్లో నిర్బంధిస్తున్నారని అన్నారు. లౌకిక భారత రాజ్యాంగాన్ని మార్పులు చేస్తూ మతరాజ్యంగా మార్చడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు మతసామరస్యాన్ని కాపాడుకుందాం అని ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, యంగ్ వర్కర్స్టీరింగ్ కమిటీ జిల్లా కోకన్వీనర్ బీమాకాని గణేష్ జిల్లా కమిటీ సభ్యులు గుండాల నరేష్ సలివోజు సైదాచారి నలపరాజు సైదులు, గంజి రాజేష్ వివిధ సంఘాల నాయకులు గంజి నాగరాజు ఎడ్ల తరుణ్ బొమ్మకంటి లక్ష్మీపతి పేర్ల సంజీవ, జీడిమెట్ల నరసింహ బకరం మహేందర్, సిరాజుద్దీన్, శ్రీనివాస చారి,బొల్లు రవీందర్, ఎల్లేశ్, పందుల లింగయ్య, దున్న అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

## మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం

## బాధితులకు సత్వర న్యాయం, అండగా నిలవాలి

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )





మహిళలు, బాలికలు మరియు చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ నల్గొండలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

భరోసా కేంద్రంలోని కౌన్సెలింగ్ గదులు, బాధితులకు అందిస్తున్న సహాయ సేవలు, కేసుల నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు మరియు చిన్నారుల పట్ల సానుభూతి, గోప్యత, గౌరవంతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన పోలీస్, వైద్య, న్యాయ మరియు మానసిక సహాయాన్ని సత్వరమే అందించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల కేసుల్లో బాధిత చిన్నారుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని చైల్డ్ ఫ్రెండ్లీ విధానంలో విచారణ, కౌన్సెలింగ్ మరియు ఇతర సహాయ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత పోలీస్ అధికారులు, వైద్య, న్యాయ మరియు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు నిరంతరం సహకారం అందించాలని ఎస్పీ తెలిపారు. కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. భరోసా కేంద్రం బాధితులకు “అండగా నిలిచే కేంద్రంగా” పనిచేయాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఇన్చార్జ్ ఎస్ఐ అఫ్రీన్, ఎస్ఐ గౌస్, ఏఎస్ఐ అబేదా, శ్రీనివాస్, భరోసా కేంద్రం కోర్డినేటర్ నళిని,సిబ్బంది, సంబంధిత పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )

గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గొల్ల గూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించనున్న దృష్ట్యా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి 2 బి హెచ్ కె ఇండ్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కాగా గొల్లగూడ 2 బిహెచ్ కె సముదాయంలో 552 ఇండ్లు పూర్తికాగా మంత్రి వాటిని ప్రారంభించి అక్కడే లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు ,భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తో పాటు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న గృహాలు, కాలనీ మొత్తానికి సంబంధించి ప్రారంభోత్సవ శిలాఫలకం ఏర్పాటు చేయాలని, కాలనీ మొత్తం శుభ్రంగా ఉంచాలని, కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం టెంట్లు, తాగునీరు, తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే లబ్ధిదారులకు ఇంటి ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి ,గృహ నిర్మాణ శాఖ పీడీ లోకి లాల్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి,తహసీల్దార్ పరుశురాం,మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్,మాజీ జెడ్ పి టి సి గుమ్మల మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నల్గొండలో ఘనంగా తిరంగా ర్యాలీ

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )




నల్గొండ పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా పాలకూరి రవి గౌడ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా మనకు లభించిన స్వేచ్ఛను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అమరవీరుల స్ఫూర్తితో నేటి యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి అరుణాచలం వరకు భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు వేరైనా భారతీయులందరం ఒక్కటేనని రవి గౌడ్ అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం స్ఫూర్తితో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, ప్రతి గుండెలో దేశభక్తిని నింపాలని ఆయన పిలుపునిచ్చారు. యువత పెద్ద సంఖ్యలో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని దేశభక్తి భావాన్ని చాటడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పాలకూరి రవి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



# నల్లగొండ



# మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

## నాంపల్లి ఎస్సై కే. లింగారెడ్డి హెచ్చరిక

నాంపల్లి ఆగస్టు 14(వార్త వేదిక సూర్య)



నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలో 14 బైక్‌ల సీజ్.. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్, ఫైన్లు విధింపు మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మితిమీరిన వేగంతో రాష్ డ్రైవింగ్ చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని నాంపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) కే. లింగారెడ్డి హెచ్చరించారు. నాంపల్లి మండల కేంద్రంలో పోలీసులు చేపట్టిన ప్రత్యేక వాహన తనిఖీల్లో (స్పెషల్ డ్రైవ్) భాగంగా.. నిబంధనలకు విరుద్ధంగా బైక్‌లు నడుపుతున్న మైనర్లు, రాష్ డ్రైవింగ్ చేస్తున్న మొత్తం 14 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సదరు యువకులను, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను వారికి జరిమానాలు (ఫైన్లు) విధించార తల్లిదండ్రులు బాధ్యతారాహిత్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. ఇకమీదట ఎవరైనా మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కూడా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తాం. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలకు ముప్పు తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెల శారీస్, జువెలరీస్ షో రూమ్ ను ప్రారంభించిన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )



మహిళలకు జ్యువలరీ, వెండి వస్తువులతో పాటు పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్ ఒకే వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయమని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రకాశం బజార్లో ఏర్పాటుచేసిన శ్రీ వెన్నెల శారీస్, జువెలరీస్ షో రూమ్ ను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ప్రారంభోత్సవ సందర్భంగా ఎలాంటి తరుగు, మేకింగ్ చార్జెస్ లేకుండా వెండి బంగారు ఆభరణాలు అమ్మకాలు జరుపుతున్నారని, ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, మంత్రి పిఏ ఎదుళ్ల మధుసూదన్ రెడ్డి,డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, కార్పొరేటర్లు రఫీ ఉద్దీన్ హాజీ, యమ కవితా దయాకర్, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, ఫసాహత్ అలీ బాబా, వెన్నెల సారీస్ అధినేత చొక్కారపు వెంకన్న,మాధవి, సాయి నిఖిల్, వెన్నెల, మిర్యాలదేవేందర్, వినోద్,భజరంగ్, నిర్మల, ప్రీతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్ నూతన ఎస్ఐగా సంపత్ బాధ్యతలు స్వీకరణ

గట్టుప్పల.ఆగస్టు 14.వార్త వేదిక సూర్య:



గట్టుప్పల్ నూతన ఎస్ఐ గా సంపత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ వన్ టౌన్ స్టేషన్ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ సంజీవ రెడ్డి మునగాల కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్ఐ సంపత్ మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. నూతన ఎస్ఐ కు ప్రజాప్రతినిధులు మండల నాయకులు గ్రామస్తులు శు భాకాంక్షలు తెలియజేశారు.



# నాగర్‌కర్నూల్

## చిన్నంబావి మండలంలోనిబిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

ఆగస్టు14 వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :



శుక్రవారశీ'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బిజెపి మండల అధ్యక్షుడు రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి జాతీయ జెండాను కార్యకర్తలు, నాయకులతో కలిసి చిన్నంబావి మండలంలోని ప్రధాన వీధుల్లో నడిచారు. చిన్నంబావి చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు బయలుదేరి తిరిగి మళ్లీ అంబేద్కర్ విగ్రహం వరకు ట్రాక్టర్ ర్యాలీ విద్యార్థులతో చౌరస్తా వరకు సాగింది. చౌరస్తాలో జనగణమన జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య బీజేపీ నాగర్ కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ ఎం లింగస్వామి కిరణ్ వెంకటస్వామి మండ్ల గోపాల్ ఎన్ బాలయ్య నాయుడు తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

ఆగస్టు14 వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :



గోపాల్ పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు అందరూ కలిసి '80' ఆకృతిలో కూర్చొని దేశ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు చెన్న పద్మ, సునీత, వీరమణి, షబానా, ప్రవీణ, మహేశ్వరి తదితరులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య ) :



నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ముఖ్య అతిథిగా నియమించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి హాజరై ఉదయం 9:20 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ శుక్రవారం తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమ వివరాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వెల్లడిస్తూ, ఉదయం 9:05 గంటలకు జిల్లా ఎస్పీ, 9:10 గంటలకు జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, అనంతరం 9:15 గంటలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముఖ్య అతిథి డా. జి. చిన్నారెడ్డి పెరేడ్ మైదానానికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

9:20 గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, రాష్ట్ర అధికారిక గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9:30 గంటలకు పోలీస్ కవాతు, 9:40 గంటలకు ముఖ్య అతిథి జిల్లా ప్రగతి సందేశం ఇవ్వనున్నారు.

అనంతరం 10:05 గంటలకు వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10:40 గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం చేయనున్నారు. 10:45 గంటలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి స్టాళ్లను ముఖ్య అతిథి సందర్శించనున్నారు.

11:15 గంటలకు వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహూకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. 11:45 గంటలకు జాతీయ గేయాలాపన, జాతీయ గీతాలాపన అనంతరం 11:50 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, ప్రజల్లో దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణం లో

# నాకాబందీ.. విస్తృత తనిఖీలు



నల్లగొండ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య )

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పట్టణంలో నాకాబందీ ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టింది. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా తనిఖీల్లో పాల్గొని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, లాడ్జీలు, హోటళ్లు, ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, రద్దీ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న తనిఖీలను పరిశీలించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. లాడ్జీలు, హోటళ్లలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలను పరిశీలిస్తూ వారి గుర్తింపు పత్రాలు, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను పోలీసులు తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లలో ప్రయాణికుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద



వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు కనిపించినప్పుడు వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నల్గొండ జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.



## ఆగస్టు 15న డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుల చేతుల మీదుగా పంపిణీ,

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య ) :

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోనూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి అనుసంధానంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుల చేతుల మీదుగా లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా డిజిటల్ విధానాన్ని మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎం.పీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్దిదారులు, వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది, డిజిటల్ రేషన్ కార్డుల లబ్ధిదారులు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సదుపాయాలను పారదర్శకంగా, సులభతరంగా అందించడంతో పాటు, లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి హాజరయ్యే లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరానికి చేరుకోవాలని సూచించారు.

# ఐడీఓసీ ప్రభుత్వ కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య ) :

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీలో ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, నిర్వహణ, పరిశుభ్రత, సిబ్బంది హాజరు తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో కలిసి ఐడీఓసీ భవనంలోని వివిధ అంతస్తుల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను విస్తృతంగా సందర్శించి,ప్రతి కార్యాలయంలో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయాల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు, నిర్లక్ష్యం కనిపిస్తే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టం చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలు కేవలం ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలే కాకుండా, వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే కేంద్రాలని, అందువల్ల కార్యాలయాలు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి శాఖాధికారిపై ఉందని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరై బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

తన ఆకస్మిక తనిఖీలను కలెక్టర్ ఐడీఓసీ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ప్రధాన సమావేశ మందిరం నుంచి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ విభాగాలను పరిశీలించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సాంకేతిక సదుపాయాలు, పరికరాల నిర్వహణ, అవసరమైన మౌలిక వసతులపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అదేవిధంగా భూగర్భ జిల్లా వనరుల విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్ల కార్యాలయాలను సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, ఫైళ్ల నిర్వహణ, కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, పాత సామగ్రి తదితర అంశాలను పరిశీలించారు.

కలెక్టరేట్ రికార్డు గది, స్టోర్ రూమ్‌లను కూడా కలెక్టర్ ప్రత్యేకంగా తనిఖీ చేశారు. రికార్డులు, సామగ్రిని ఎలా భద్రపరుస్తున్నారు? ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి ఏవి? వినియోగంలో లేనివి ఏవి? అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు.

అనంతరం మొదటి అంతస్తులోని గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. సహాయ సంచాలకులు భూ కొలతల కార్యాలయం, పంచాయతీ అధికారి కార్యాలయం, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, పరిశ్రమల శాఖ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఎక్సైజ్ శాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాలను పరిశీలించారు.

హౌసింగ్, పే అండ్ అకౌంట్స్, ట్రెజరీ, జిల్లా వ్యవసాయ శాఖ, గిరిజన అభివృద్ధి, సహకార శాఖ కార్యాలయాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా శాఖలకు వచ్చే ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది అందుబాటులో ఉండే విధానం, కార్యాలయాల్లోని పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెండో అంతస్తులో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్, ఉద్యాన శాఖ, మత్స్యశాఖ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా మేనేజర్ పౌరసరఫరాల శాఖ సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖ కార్యాలయాలను కూడా సందర్శించారు.

అదేవిధంగా రోడ్లు భవనాల శాఖ, ఆడిట్ కార్యాలయం, జిల్లా



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాలను తనిఖీ చేశారు. రెండో అంతస్తులోని సమావేశ మందిరాలు, సర్వర్ రూమ్‌లు, ఎలక్ట్రికల్ రూమ్‌లను కూడా పరిశీలించి వాటి నిర్వహణ, భద్రత, పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులను ఆరా తీశారు.

సర్వర్ రూమ్‌లు, ఎలక్ట్రికల్ రూమ్‌లలో పరికరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీ సందర్భంగా కలెక్టర్ ప్రధానంగా కార్యాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయాల లోపల మాత్రమే కాకుండా భవన పరిసరాలు, మెట్ల మార్గాలు, స్టోర్ రూమ్‌లు, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఖాళీ ప్రదేశాలు కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

చెత్త, పనికిరాని సామగ్రి, పాత వస్తువులు కార్యాలయాల్లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గుర్తించి తొలగించాలని సూచించారు. కార్యాలయ పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు బాధ్యతలను సంబంధిత సిబ్బందికి అప్పగించాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండటం పరిపాలనలో భాగమని కలెక్టర్ పేర్కొన్నారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతి శాఖాధికారి తన కార్యాలయ నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

కలెక్టరేట్ రికార్డు గదిలో భద్రపరిచిన పాత రికార్డులను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ముఖ్యంగా వినియోగంలో లేని రికార్డులు, పాత ఎన్నికల రికార్డుల నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వినియోగంలో లేకుండా ఉన్న రికార్డులు, అనవసరంగా స్థలాన్ని ఆక్రమిస్తున్న పత్రాలను నిబంధనల ప్రకారం వర్గీకరించాలని సూచించారు. నిబంధనల మేరకు తొలగించేందుకు అర్హత ఉన్న రికార్డులను గుర్తించి, వాటిని తొలగించే ప్రక్రియను చేపట్టాలని ఏవోను ఆదేశించారు.

అదే సమయంలో భవిష్యత్తులో అవసరమయ్యే కీలక రికార్డులను మాత్రం సురక్షితంగా, క్రమబద్ధంగా భద్రపరచాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు.

జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో కార్యాలయ ఆవరణలోని ఒక ప్రాంతంలో అపరిశుభ్ర పరిస్థితులను కలెక్టర్ గమనించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని, అక్కడ ఖాళీగా ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఏటీవోకు సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని, ఆ ప్రదేశం తిరిగి అపరిశుభ్రంగా మారకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో కలెక్టర్ మానవీయ కోణంలో స్పందించారు. బిజినపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన ప్రవళిక సుమారు 15 రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్.. ఆమెకు జన్మించిన చిన్నారి గురించి ఆరా తీశారు, అనంతరం ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? వైద్య సేవలు అందుతున్నాయా? తల్లి మృతి అనంతరం కుటుంబానికి ఎలాంటి సహాయం అందుతోంది? తదితర వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)ను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారికి అవసరమైన వైద్య సేవలు, ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. చిన్నారి ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలందించే కేంద్రాలుగా మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చినప్పుడు వారికి అవసరమైన సమాచారం, సేవలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆకస్మిక తనిఖీ ద్వారా కార్యాలయాల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, లోపాలను అక్కడికక్కడే గుర్తించి సరిదిద్దేందుకు కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, కార్యాలయాల నిర్వహణ, పరిశుభ్రత, సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో డిఆర్ఓ పాండు ఏవో చంద్రశేఖర్, పాటు వివిధ శాఖల అధికారులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 87
శనివారం
15 ఆగస్టు 2026



## వెన్నెల పాల కేంద్రం ꣸ శ్రీ విఘ్నేశ్వర కమ్యూనికేషన్స్ & టూర్స్ & ట్రావెల్స్ ప్రారంభోత్సవానికి హాజరైన చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆగస్టు14 వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :

ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి గారు. జంగ బీచ్పల్లి యాదవ్ గారు. కృష్ణ ప్రసాద్ యాదవ్ గారు. వడ్డేమాన్ బిచ్చన్న గారు. తేజ రెడ్డి గారు. తగరం కాన్సిరాం గారు. తగరం శ్రీనివాసులు గారు. కాకనూరు మునిస్వామి గారు. పానుగంటి బాల వెంకట్ గారు. పరిమళ చెన్నయ్య గారు.భాస్కర్ గారు. జూపల్లి యువసేన నాయకుడు కత్తి జానీ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజలకు సొంతింటి కల..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14(వార్త వేదిక సూర్య):



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా నవాబుపేట మండల కేంద్రంలో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఈసురి వెంకటేష్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో లబ్ధిదారుడి ఇంటి స్థలంలో ముగ్గు పోయించి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో లబ్ధిదారుడు ఈసురి వెంకటేష్ ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించినందుకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఆయన సోదరుడు జనంపల్లి దుష్యంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య):



నవాబుపేట మండలం ఊరంచు తండాకు చెందిన తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లావుడ్యా రాములు నాయక్ తాత గంగ్య నాయక్ (96) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు.

విషయం తెలుసుకున్న నవాబుపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ నర్సింలు, కుర్రోళ్ల సీనయ్య, మాజీ సర్పంచ్ గోపాల్, ముత్యాల రవీందర్ రెడ్డి, ఎం.డి. తయర్ తదితరులు ఊరంచు తండాకు చేరుకుని గంగ్య నాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):





శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్ ) కుటుంబ సమేతంగా అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జోగులాంబ అమ్మవారికి, శ్రీ శ్రీ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు.

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి గళమెత్తాలి

### అక్రిడిటేషన్ సమస్య ఐదు నిమిషాల్లో పరిష్కారం.. ఇళ్ల సమస్యపై కార్యాచరణ ఏది?..

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):

జర్నలిస్టుల సమస్యల్లో కేవలం అక్రిడిటేషన్ ఒక్కటే కాదని, ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్య కూడా అత్యంత ప్రధానమైనదని మనం జర్నలిస్ట్ జిల్లా కార్యదర్శి, టీజేడబ్ల్యూఎఫ్ నాయకులు ఎం. గోపాల్ మహారాజ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై అన్ని జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఏకమై కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై స్పందించిన ఆయన.. ఇల్లు అనేది కేవలం నివాసం కాదు.. ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. 50 ఏళ్లు దాటిన పలువురు జర్నలిస్టులు ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారు. ఇళ్లిస్తామని హామీలు ఇచ్చినా నేటికీ పూర్తి స్థాయిలో కార్యాచరణ ముందుకు సాగలేదు. ప్రతి జర్నలిస్టుకు ఇల్లు లేదా ఇంటి స్థలం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని కోరారు.

జర్నలిస్టుల సమస్యలపై ఏర్పాటైన గ్రూపులో 200 మందికి పైగా జర్నలిస్టులు ఉన్నారని, వారిలో దాదాపు 80 శాతం మందికి ఇప్పటికే ఇళ్లు లేదా పట్టాలు వచ్చాయని ఆయన తెలిపారు. మిగిలిన జర్నలిస్టులకు కూడా సమాన గౌరవంతో ఇళ్లు లేదా ఇంటి స్థలాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ధనబలం, పలుకుబడి ఉన్నవారు తమ పనులు సాధించుకుంటున్నప్పటికీ, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన జర్నలిస్టుల పరిస్థితిని కూడా పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల విషయంలో ఆయా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న బ్యూరో ఇన్‌చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, సంబంధిత బాధ్యులు తమ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కార్డులు ఇప్పించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. అప్లికేషన్ చేసినప్పటికీ అక్రిడిటేషన్ ఎందుకు రాలేదో కూడా సంబంధిత జర్నలిస్టులకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

అయితే అక్రిడిటేషన్ సమస్యను మాత్రమే ప్రధాన అంశంగా చేసుకుని, జర్నలిస్టుల ఇళ్ల సమస్యను విస్మరించకూడదని ఆయన సూచించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గాలు, సీనియర్ జర్నలిస్టులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో జర్నలిస్టులకు దక్కాల్సిన ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి జర్నలిస్టుకు ఇల్లు లేదా ఇంటి స్థలం సాధించే లక్ష్యంతో జర్నలిస్టు సంఘాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అవసరమైతే 'జర్నలిస్టుల ఇళ్ల సాధన కమిటీ' ఏర్పాటు చేసి ఉద్యమాన్ని కొనసాగించాలని ఎం. గోపాల్ మహారాజ్ విజ్ఞప్తి చేశారు. మానవీయ కోణంలో ప్రతి ప్రజాప్రతినిధి, నాయకుడు జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై స్పందించాలని, అందరికీ సమానంగా న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆయన కోరారు.

# మహబూబ్‌నగర్



## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి...

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు షూస్, టై, బెల్టులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడంతో పాటు ఉదయం, మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామచందర్, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సోమలింగం, ఉమ్మడి కుల్కచర్ల మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, మందిపాల్ గ్రామ సర్పంచ్ నాగరాజు, చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, సలీం, మహిళా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో 'మిల్లెట్ భారత్'..

### విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):




భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో వినూత్నంగా 'మిల్లెట్ భారత్' చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. కళాశాలలో ఈ ఏడాది కొత్తగా ప్రారంభించిన ఏఈడీపీ కోర్సు హార్టికల్చర్ విభాగం విద్యార్థులు వివిధ రకాల చిరుధాన్యాలను ఉపయోగించి భారతదేశ పటాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు.

చిరుధాన్యాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. బి. సదాశివయ్య తెలిపారు. నెల రోజులుగా హార్టికల్చర్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు ఎంతో ఆసక్తి, అంకితభావంతో పనిచేసి 'మిల్లెట్ భారత్'ను రూపొందించారని చెప్పారు.

రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, వరిగలు తదితర చిరుధాన్యాల ప్రాధాన్యతను ఈ చిత్రపటం ద్వారా చాటి చెప్పినట్లు డా. సదాశివయ్య తెలిపారు. చిరుధాన్యాలు మనిషికి పోషకాహారాన్ని అందించడమే కాకుండా పర్యావరణానికి అనుకూలమైన పంటలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పశుపక్ష్యాదులకు కూడా చిరుధాన్యాలు మంచి ఆహార వనరుగా ఉపయోగపడతాయని తెలిపారు.

'సస్యశ్యామల భారతదేశం -- ఆరోగ్యకరమైన భారతదేశం' అనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లడమే 'మిల్లెట్ భారత్' ప్రధాన ఉద్దేశమని అన్నారు. విద్యార్థుల్లో కష్టపడే తత్వం, సృజనాత్మకత, బృంద స్ఫూర్తి, ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 'మిల్లెట్ భారత్' విద్యార్థులు, కళాశాల సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కార్యక్రమం విజయవంతం కావడంలో హార్టికల్చర్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థుల కృషి అభినందనీయమని డా. సదాశివయ్య ప్రశంసించారు.

ంఈ వినూత్న కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## పాలమూరులో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):



భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలమూరు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు ఎంపీ శ్రీమతి డీకే అరుణ పాల్గొన్నారు. ర్యాలీలో సుమారు 6 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బీజేవైఎం యువమోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా 'భారత్ మాతాకీ జై' నినాదాలతో పరిసరాలు మార్మోగాయి.

# అవయవదానంపై అవగాహన సదస్సు..



మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):

మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ ꣸ పీజీ కళాశాల (అటానమస్)లో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వయంతో, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యవక్తగా పాల్గొన్న అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ ఏ. నటరాజ్ మాట్లాడుతూ.. మరణం తర్వాత శరీరం మట్టిలో కలిసిపోతుందని, అయితే అవయవాలను దానం చేస్తే అవి మరొకరి శరీరంలో జీవిస్తాయని అన్నారు. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, సరికొత్త జీవితాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అవయవదానం సాధారణ దానం కాదని, జీవితాన్ని అందించే మహాదానమని తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీలకు 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేసినట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. మన జీవితం ఒకరోజు ముగిసినా, మన మానవత్వానికి ముగింపు ఉండకూడదన్నారు. మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగుతుందని చెప్పారు. మన కళ్లతో ప్రపంచాన్ని చూడలేకపోయినా, మనం చేసే నేత్రదానం ద్వారా మరొకరు ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ.. సమాజంలో అవయవదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత విద్యావంతులు, సైన్స్ విద్యార్థులపై ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజానికి చేరవేసి అవయవదానంపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వేణుగోపాల్, బాబులెరెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ ఉదయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్,మధు,రఘువీర్ గుప్త, అదిబాతాజ్, నసీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సీ.హెచ్. శివప్రసాద్ పాల్గొన్నారు.

## కనకదుర్గ రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు..

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య):

నవాబుపేట మండలం తీగలపల్లి గ్రామంలోని శ్రీ కనకదుర్గ పారా బాయిల్డ్ రైస్ మిల్లు యజమాని ధర్మారం కొట్టం సాయిబాబా రెడ్డిపై కేసు నమోదైంది. ఈ నెల 6వ తేదీన సివిల్ సప్లైస్ అధికారులు రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

తనిఖీల సందర్భంగా మిల్లులో సుమారు 49,149 వరి ధాన్యం బ్యాగులు (1,965 మెట్రిక్ టన్నులు) తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కొరత విలువ సుమారు రూ.7.12 కోట్లు ఉంటుందని సివిల్ సప్లైస్ అధికారులు అంచనా వేశారు.

ఈ వ్యవహారంపై సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు రైస్ మిల్లు యజమాని ధర్మారం కొట్టం సాయిబాబా రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# అక్రమ ఇసుక తవ్వకాలు, భూభారతి అంశాలపై కలెక్టర్ సమీక్ష..

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (వార్త వేదిక సూర్య):

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను నియంత్రించడంతో పాటు వివిధ ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ సమీక్షలో జిల్లాలోని తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనమా, ల్యాండ్ రీ-సర్వే, మీ-సేవ, ప్రజావాణి, ప్రజాపాలన, కుటుంబ రిజిస్ట్రేషన్ తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

అలాగే జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై కూడా సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి



కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే ఆయుధం

- ఎస్ఐ కుమారస్వామి యాదవ్
- ముత్తిరెడ్డిగూడెంలో పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు
- గ్రామస్తులకు దిశానిర్దేశం చేసిన ఎస్ఐ కుమారస్వామి యాదవ్
- పాల్గొన్న సర్పంచ్ బాలరాజు గౌడ్, గ్రామస్తులు

**మోటకొండూరు,ఆగస్టు 14(వార్త వేదిక సూర్య):–** గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తూ ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ కుమారస్వామి యాదవ్ స్వయంగా పర్యవేక్షించి, గ్రామస్తులకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై దిశానిర్దేశం చేశారు. పెరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం...**

ఈ సదస్సులో ఎస్ఐ కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. "గ్రామంలో అవాంఛనీయ ఘటనలు, దొంగతనాలు జరగకుండా ముందుస్తుగా నివారించడంలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. ఎవరైనా నేరానికి పాల్పడితే సీసీ ఫుటేజీ ఆధారంగా వారిని పట్టుకోవడం మాకు సులభం అవుతుంది" అని వివరించారు. గ్రామస్తులు, యువకులు ముందుకు వచ్చి కాలనీలు, వీధులు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చొరవ చూపాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరిస్తే ఉపేక్షించవద్దని, వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 – 112 కు సమాచారం అందించి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ఎస్ఐ పిలుపు మేరకు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామని గ్రామ సర్పంచ్ మరియు యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కుమారస్వామి యాదవ్ తో పాటు గ్రామ సర్పంచ్ బుడిగె బాలరాజు గౌడ్, గ్రామస్తులు శశిధర్ రెడ్డి, అడేపు శ్రీను, గుర్రాల వెంకన్న, నేనేముంతల సంతోష్, ఎరుకలి ఉపేందర్, యువకులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## యాదాద్రి భువనగిరి

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



**మోత్కూరు, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య):** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్.ఓ.కు సూచించారు. వంటగది, స్టోర్ రూమ్, నిత్యవసర సరుకులను పరిశీలించారు. అనంతరం నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న భోజన ప్లేట్లు గ్లాసులతో కూడిన ఐదు రకాల వస్తువులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ యాదమ్మ, ఉపాధ్యాయులు రేఖ,సుజాత,రమ్య,అనిత, గాంధీ లక్ష్మి,వసుంధర, సంధ్య,లక్ష్మీదేవి, ఉమా పాల్గొన్నారు.



# ఆరెగూడెంలో గడపగడపకూ 'మార్నింగ్ వాక్'

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ఆదేశాలతో ముమ్మర పర్యటన
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా
- పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు

**మోటకొండూరు, ఆగస్టు 14(వార్త వేదిక సూర్య):–**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఆలేరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ఆదేశాల మేరకు మోటకొండూరు మండలం ఆరెగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం 'ఇంటింటా మార్నింగ్ వాక్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తెల్లవారుజామునే గడపగడపకూ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వారు అవగాహన కల్పించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత కరెంటు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కల్యాణ లక్ష్మి తదితర పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తామని వారు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆరెగూడెం సర్పంచ్ పేరబోయిన దివ్య మకరజ్యోతి కార్తీక్, ఉప సర్పంచ్ లత నాగరాజు, గ్రామ పంచాయతీ సెక్రటరీ జమ్లా నాయక్, వార్డు సభ్యులు పల్లె భాస్కర్, బరిగెల వెంకటేష్, మారబోయిన పద్మ పాండు, కొల్లూరి ఉప్పలమ్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లూరి హరిబాబు, ఉపాధ్యక్షులు పేరబోయిన శంకర్, పార్టీ నాయకులు రాజశేఖర్, జానీ ప్రసాద్, పద్మనాభం మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చందేపల్లిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన

- ప్రజల వద్దకు కాంగ్రెస్ శ్రేణుల మార్నింగ్ వాక్



**మోటకొండూరు/ వార్తా వేదిక సూర్య:–:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటి అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ శ్రేణులు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వి,ప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మోటకొండూర్ మండలం లోని చందేపల్లి గ్రామంలో మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నాయకులు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, జీరో కరెంట్ బిల్లు తదితర పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అ మలవుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేరుగా విని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోట్ల నగేశ్, పిఏసిఎస్ డైరెక్టర్ బొల్లేపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుదగాని జయరాములు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బోట్ల సంజీవ, కూర్మ సంఘం అధ్యక్షుడు కందరపు కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులు 31లోపు అప్‌లోడ్ చేయాలి



**రామన్నపేట, ఆగస్టు 14 (వార్తా వేదిక సూర్య):** అర్హులైన లబ్ధిదారుల చేయూత పెన్షన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీలకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి చేయూత పెన్షన్ అందేలా దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అదేవిధంగా 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి)లిలిను రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు.వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించేలా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్ల నిర్మాణ పనులను చేపట్టాలని కమిషనర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రామన్నపేట ఎంపీడీఓ రాములు, ఎంపీవో రఫీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తమకు విద్యా గ్రంధాన్ని అందించిన పాఠశాలను

# అందంగా తీర్చి దిద్దిన పూర్వ విద్యార్థులు








**రామన్నపేట ఆగస్టు 14( వార్తా వేదిక సూర్య ) :** ప్రాథమికోన్నత పాఠశాలకు మెరుగులు దిద్దిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న బడిని మర్చిపోకుండా, చదువుల తల్లిని గుర్తు చేసుకుంటూ ఆ పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు.రామన్నపేట నడిబొడ్డున కల కోల్పోయి ఉన్న పాఠశాల భవనానికి రూపురేఖలు మార్చారు. 1974-1976 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఇటీవల గోల్డెన్ జూబ్లీ వేడుకలను జరుపుకొని చదువు సంధ్యలు నేర్పిన పాఠశాలను బాగు చేయాలని నిర్ణయించారు. వీరిలో భాగంగా రామన్నపేటకు చెందిన బట్టె ఈశ్వర్ సొంత ఖర్చుతో పాఠశాల భవనానికి అందమైన రంగులు వేయించాడు. విరిగిపోయిన కిటికీలను బాగు చేయించాడు. అలాగే సోదరుడైన బట్టె లక్ష్మణ్ కూడా తన వంతు సాయం చేస్తామని ముందుకు వచ్చాడు.ఈ పాఠశాలకు బోర్డు అంటే ఎంతో అందంగా ఉంటుందని భావించి కొత్త బోర్డు ను తయారు చేయించాడు. ఇంకేముంది స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఈ పాఠశాల ఎంతో ముస్తాబై ఉంది.ఈ పాఠశాల అందమైన భవనంగా మారడానికి తోటి మిత్రులైన గోదాసు గోపాల్,ఆముద లక్ష్మణ్, ఆరె రమేష్,ఎండి అయూబ్,రహమాన్ కలిసి సహకారం అందించారు.గత నెల రోజుల సలహాలు సూచనలు అందజేస్తూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారు.ఏది ఏమైనా పూర్వ విద్యార్థులు తమకు విద్యా గ్రంధాన్ని అందించిన పాఠశాలను మరవకుండా బాగు చేసుకోవడం అందరికీ ఆదర్శం.

# పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత

**వలిగొండ ఆగస్టు 14 ( వార్తా వేదిక సూర్య) :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజ సేవకుల భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన 'పాఠశాల అభివృద్ధిలో సమాజ సేవకులు' కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.వలిగొండ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ బత్తిని వెంకటేష్ తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఆకర్షణీయమైన దుస్తులతో పాఠశాలకు హాజరై, క్రమశిక్షణతో చదువుకోవాలనే ఉద్దేశంతో విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులను ఉచితంగా అందజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆలకుంట శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి స్పందించి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించిన బత్తిని వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మంచి మనసుతో ముందుకొచ్చే దాతలకు పాఠశాల తరపున అభినందనలు తెలిపారు.బత్తిని వెంకటేష్ తరపున ఆయన సోదరుడు బత్తిని బాల్‌శెట్టి మాట్లాడుతూ మన ఊరి పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునగపాటి వరమ్మ, మామిడి కవిత, మణిమాల, ప్రశాంతి, ఉషారాణితో పాటు పుర ప్రముఖులు కాసుల వెంకన్న, కీర్తి రమేష్, పిట్టల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





# యాదాద్రి భువనగిరి

# ఘనంగా తీరంగా ర్యాలీ

**చౌటుప్పల్ ఆగస్టు 14 వార్తా వేదిక సూర్య** చౌటుప్పల్ లో ఘనంగా తిరంగా –ర్యాలీలి భారీగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు80వ దినోత్సవాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాను పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను జాతీయ జెండా ప్రాముఖ్యత దేశభక్తి జాతీయ సమైక్యత గురించి వివరించారు .ఈ సందర్భంగా రాజకీయ నాయకులు మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర



సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్రం లభించిందని అన్నారు. త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని దేశ ఐక్యతను కాపాడుతూ భారతదేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీశ్రీ భారతదేశం యొక్క ప్రాముఖ్యతను కాపాడుకుంటూ వారి







త్యాగాల తోటి ఏర్పడ్డ భారత స్వాతంత్రాన్ని ప్రజలకు సేవ చేయాలనే లివికసిత్ భారత్ అనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు అని అన్నారు యువత విద్యార్థులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని విద్యతో పాటు దేశభక్తి క్రమశిక్షణ సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని నాయకులు సూచించారు తిరంగా ర్యాలీ ద్వారా దేశభక్తి జాతీయ సమైక్యత ఐక్యత భావాన్ని ప్రజలలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యం అని తెలిపారు .యొక్క ర్యాలీ సందర్భంగా భారత్ మాతాకీ జై వందేమాతరం వంటి దేశభక్తి నినాదాలతో చౌటుప్పల పట్టణం మార్మోగింది విద్యార్థులు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు మరియు ఉత్సాహభరిత భాగస్వామ్యంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు .ఈ యొక్క తిరంగా ర్యాలీకి చౌటుప్పల పట్టణంలోని కళాశాల యాజమాన్యాలు మరియు స్కూల్ యాజమాన్యాలు తమ విద్యార్థుల తోటి పెద్ద ఎత్తున సుమారు 2000 మంది విద్యార్థుల తోటి పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్ సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య జిల్లా ఉపాధ్యక్షులు సాగచంద్రశేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శి జక్కల రాజు యాదవ్ ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం యాదవ్ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ బీజేవైఎం సీనియర్ నాయకులు దిండు భాస్కర్ పబ్బు వంశీ చింతపల్లి వినయ్ రెడ్డి పందుల శరత్ వరగంటి భాను ప్రకాష్ గౌడ్ సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల భూపాల్ రెడ్డి గుజ్జుల సురేందర్ రెడ్డి గుండ్ల శంకరయ్య మన్నే ప్రతాపరెడ్డి కంచర్ల గోవర్ధన్ రెడ్డి ఉడుగు యాదయ్య గౌడ్ ఉడుగు వెంకటేశం గౌడ్ బత్తుల జంగయ్య గౌడ్ రీక్కల సుధాకర్ రెడ్డి కాయతి రమేష్ బాతరాజు సత్యం సర్పంచులు తంగళ్ళ వెంకటేశం నందగిరి వెంకటేశం కౌన్సిలర్లు ఉపసర్పంచులు బోయ సదానందం చెరుకు శివ గుండెబోయిన వేణు వంగాల రమాకాంత్ యాస అశోక్ రెడ్డి పబ్బతి శేఖర్ బాలరత్నం కంచర్ల వెంకట్ రెడ్డి వనం ధనంజయ ఉష్కాగుల నాగరాజు లగ్గొని పాండు కానుగు శేఖర్ కడారి నందకిషోర్ గుండె పల్లి వెంకటరెడ్డి ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాజపా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



**మోత్కూరు, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య):** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపులో భాగంగా హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భాజపా అధ్యక్షురాలు చాడ మంజులారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమకారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మాజీ సభ్యులు కొణతం నాగార్జున రెడ్డి, తిరంగా యాత్ర జిల్లా కోబికన్వీనర్ బి. చంద్రశేఖర్, భాజపా జిల్లా సీనియర్ నాయకులు జి శ్రీనివాస్ గుప్తా, బొట్టు అబ్బయ్య,, మాజీ పట్టణ అధ్యక్షులు పోచం సోమయ్య స్థానిక నాయకులు కందుకూరి ప్రకాష్, మరాటి విజయలక్ష్మి, నిలిగొండ మత్స్యగిరి ,మల్లేశం, శ్రీధర్ తదితరు పాల్గొన్నారు.

# వనదేవత రూపంలో పెద్దమ్మతల్లి



**మోత్కూరు, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య):** వర్షాల కోసం స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పెద్దమ్మతల్లిని వనదేవత రూపంలో అలంకరించి అర్చకులు పారునంది లక్ష్మణామూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 6.6.1965 పత్రులు ( ఆకులు) తండులం (నానబెట్టిన బియ్యంతో ) అలంకరించి వర్షాల కోసం అమ్మవారిని పంచామృత అభిషేకం, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు వాసం రమేష్ కళావతి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న కోతులు..
# భయం గుప్పిట్లో ఆ గ్రామస్తులు



**మోత్కూరు, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో రోజురోజుకు కోతుల బెడద ఎక్కువైంది. ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలంటే కోతులు ఏ గల్లీ నుంచి వచ్చి దాడులు చేస్తుందేమోనని భయంతో చిన్న, పెద్ద లేకుండా ప్రజలు క్షణం క్షణం భయపడ వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల్లో వ్యవధిలోనే గ్రామానికి చెందిన జోగు దుర్గమ్మ,, తాటిపాముల మానసతో పాటు ఐదేళ్ల బాలుడు తొంట యశ్వంత్ త్రీవంగా కోతులు గాయపర్చాయి. దీంతో ఆ గ్రామస్తులు ఇటీవల మున్సిపల్ కమిషనర్ కు తమ సమస్యను విన్నవించారు. అయినప్పటికీ పలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గ్రామంలో కోతులు పట్టించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు ఎర్రవెల్లి మధు, నోముల రమేష్ నేత, బద్దుల చిట్టిబాబు, తొంట భాస్కర్ కోరారు.

# వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు
## 10 ద్విచక్ర వాహనాలు సీజ్



**వలిగొండ: ఆగస్టు 14 ( వార్తావేదిక సూర్య )** వలిగొండ మండలంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వలిగొండ ఎస్సై ఎ.శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నారు.తనిఖీల సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. అలాగే చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న యజమానులపై కూడా చర్యలు తీసుకుని ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఫైన్‌లు విధించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్, ఇతర అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ప్రత్యేక వాహన తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# మోటకొండూరులో కాంగ్రెస్ శ్రేణుల 'మార్నింగ్ వాక్'

- గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన
- అర్హుల నుంచి పింఛన్ దరఖాస్తుల స్వీకరణ
పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

**మోటకొండూరు/వార్త వేధిక సూర్య :-** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ఆదేశాల మేరకు మోటకొండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం 'మార్నింగ్ వాక్' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బుగ్గ కొమరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే, గ్రామంలో అర్హులైన వితంతువులు, వికలాంగులు, చేనేత మరియు గీత కార్మికుల నుంచి కొత్త పెన్షన్ల కోసం అక్కడికక్కడే దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొంత మోహన్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు, వార్డు సభ్యులు జూకంటి మధు, బాల్ద సంధ్య మధు, వంగాల మహేందర్, డైరెక్టర్లు కొల్లూరు భిక్షపతి, సీనియర్ నాయకులు భూమండ్ల ఇస్తారి, కొల్లూరి



యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ రేగు శ్రీను, బోట్ల నాగులు, కొల్లూరి రంజిత్, బోట్ల కవిత, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, కారోబార్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ముషిపట్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**మోత్కూరు, ఆగస్టు 14 ( వార్త వేదిక సూర్య):** మండలంలోని ముషిపట్ల గ్రామంలోని 4వ వార్డు ఎస్సీ కాలనీలో 16.5 అడుగుల వెడల్పుతో శుక్రవారం స్థానిక సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఇస్తూ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈసీసీ రోడ్డు నిర్మాణంతో కాలనీ ప్రజలకు రాకపోకలు ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నోముల అంజయ్య, వార్డు సభ్యులు తొంట నరేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కేమిడి సైదులు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎరసానపల్లి సందీప్, మధు కిష్టయ్య మహేష్ అఖిల,బిక్షం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**